సాక్షి
చిత్తూరు
మంగళవారం । 4 । జూలై । 2023

# ‘హామీ’తానందం!

**నేడు చిత్తూరుకు సీఎం వైఎస్.జగన్ రాక**

- మరో హామీ అమలు దిశగా అడుగులు
- అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- సీఎం సభాస్థలి, హెలీప్యాడ్‌ను పరిశీలించిన మంత్రులు, అధికారులు





**సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చిత్తూరు డెయిరీ పునఃప్రారంభం, చీలాపల్లి సీఎంసీ 300 పడకల మెడికల్ ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈ మేరకు సీఎం సభాస్థలి, పర్యటించే ప్రాంతాలను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ, సీఎం పర్యటనల కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం సోమవారం పరిశీలించారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండడంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి అధికారులకు పలు సూచనలిచ్చారు. రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ ఎండీ బాబు ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ గోవిందప్పశ్రీనివాసులు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఏపీసీ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.




### సిద్ధమైన సభావేదిక

జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభావేదిక ముస్తాబైంది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూర్చొనేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు. ఏర్పాట్లన్నీ పకడ్బందీగా పూర్తిచేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు.

### అమూల్ డెయిరీ మహిళా రైతులకు వరం

అమూల్ డెయిరీ మహిళా రైతులకు వరం అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సభాస్థలి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో అమూల్ డెయిరీ వల్ల లీటర్ పాలకు అదనంగా రూ.15 వరకు ధర వస్తోందన్నారు.

### మరో హామీ అమలు

విజయా డెయిరీని అమూల్ సంస్థ ఒప్పందంతో పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. 10 నెలల్లోనే కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రైతులకోసం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు సీఎంసీ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రిని కోరినట్లు మంత్రి వెల్లడించారు.



సభావేదికను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు

## క్లుప్తంగా

### భార్యతో గొడవపడ్డాడని..

● భర్తను కత్తితో పొడిచిన భార్య తరఫు బంధువులు


చికిత్సపొందుతున్న శ్రీరాములు

**చౌడేపల్లె:** భార్యా భర్తలిద్దరూ ఘర్షణ పడుతుండగా.. విషయం తెలుసుకున్న భార్యతరఫు బంధువులు విచక్షణా రహితంగా భర్తను పొడిచిన ఘటన స్థానికంగా సోమవారం రాత్రి కలకలం రేపింది. స్థానికుల కథనం.. మండలంలోని వెంగళపల్లె పంచాయతీ, పాలెంపల్లెకు చెందిన రామయ్య కుమారుడు గోవిందుగారి శ్రీరాములు (55), అతని భార్య బోయకొండమ్మతో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటి వద్ద గొడవ పడుతుండగా బోయకొండమ్మ అన్న కుమారుడు రమేష్, ఆమె చెల్లెలు కుమారుడు విజయ్ కత్తితో శ్రీరాములును కడుపులో పొడిచారు. పేగులు బయటకు రావడంతో శ్రీరాములు అపస్మార స్థితికి చేరాడు. గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### టీడీపీ నేతకు రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్

**రామచంద్రాపురం:** మండలంలోని గంగిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నగదు మంజూరు చేయించారు.

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 87,967 మంది దర్శించుకున్నారు. 32,083 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి హుండీ ద్వారా రూ.4.20 కోట్ల ఆదాయం వచ్చింది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# చీలాపల్లెలో 300 పడకల ఆస్పత్రి

● నేడు భూమి పూజ చేయనున్న సీఎం వైఎస్ జగన్
● సీఎంసీలో పెరగనున్న వైద్యసేవలు


ఆస్పత్రి భూమి పూజకు సిద్ధమవుతున్న సీఎంసీ ప్రాంగణం

**చిత్తూరు రూరల్:** తమిళనాడు వేలూరులోని సీఎంసీ (క్రిస్టియన్ మెడికల్ కాలేజీ) ఉత్తమ వైద్యసేవలకు ప్రసిద్ధి చెందింది. పలు రాష్ట్రాలోని ప్రజలకు మెరుగైన వైద్యం అంటే సీఎంసీనే గుర్తుకొస్తుంది. అలాంటి ప్రతిష్టాత్మకమైన ఆస్పత్రిని చిత్తూరుకు తీసుకు వచ్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి చేశారు. 2009లో గుడిపాల మండలం చీలాపల్లె వద్ద 640 ఎకరాలను కేటాయించి సీఎంసీకి అప్పగించారు. ఈ మేరకు 2010లో ఆస్పత్రి ప్రారంభమైంది. ప్రస్తుతం సీఎంసీని మరింతగా విస్తరించేందుకు 300 పడకల ఆస్పత్రిని నిర్మించాలని సీఎంసీ నిర్వాహకులు నిర్ణయించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన పూర్తిగా సహకరించడంతో పాటు భూమి పూజతో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చీలాపల్లెకు మంగళవారం విచ్చేస్తున్నారు.

**వందలాది మందికి ఉపాధి**

గుడిపాల మండలం చీలాపల్లె బొమ్మసముద్రం ప్రాంతంలోని సీఎంసీలో ప్రస్తుతం 35 రకాల వైద్య సేవలను అందిస్తున్నారు. సుమారు 600 మంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. అందులో 350 మంది చిత్తూరు వాసులే ఉండడం విశేషం. నిత్యం వెయ్యికిపైగా ఓపీలు వస్తున్నాయి. అత్యవసర సేవలకు గాను 50 నుంచి 60 మంది వస్తున్నారు. ఈ క్రమంలో ఆస్పత్రి డైరెక్టర్లు చీలాపల్లె సీఎంసీలో వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలని భావించారు. 300 పడకల ఆస్పత్రి నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. మూడు యూనిట్లుగా విభజించి ఆస్పత్రిని నిర్మించనున్నారు. ఎల్ ఆకారంలో ఈ భవనాన్ని తీర్చిదిద్దనున్నారు. తర్వాత వేలూరు సీఎంసీ తరహాలో టీచింగ్ ఆస్పత్రి, విద్య వ్యవస్థను తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయని ఆ ఆస్పత్రి నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే పనులు పూర్తయితే మరో 500 నుంచి 600 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడిస్తున్నారు.

**శంకుస్థాపనకు సర్వం సిద్ధం**

చీలాపల్లిలో 300 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన పనులు పూర్తయ్యాయి. ఆస్పత్రి డైరెక్టర్లు పనులను పర్యవేక్షించారు. అలాగే జిల్లా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్నం ఒంటి గంటకు ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు.

# శాస్త్రోక్తంగా దుర్గాదేవికి పౌర్ణమి పూజలు


పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తదితరులు


ఫలపుష్పాదులతో అలంకరణలో అలరారుతున్న ఆలయం

**కాణిపాకం(యాదమరి):** కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం మణికంఠేశ్వర స్వామి గుడిలో దుర్గాదేవి శాకాంబరి అలంకరణలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. ఆలయాన్ని పండ్లు, కూరగాయలతో విశేషంగా అలంకరించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, అధికారులు మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఐరాల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుజ్జిరెడ్డి, రవి రెడ్డి, పాల్గొన్నారు.

### రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**కుప్పం రూరల్:** మండలంలోని బంగారునత్తంలో సోమవారం సాయంత్రం రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం భద్రావతికి చెందిన శంకర్ (42) ఇరవై ఏళ్ల క్రితం బంగారునత్తం గ్రామానికి వచ్చి పెళ్లి చేసుకుని బస్టాండు సమీపంలో కాపురం ఉంటున్నాడు. ఇటీవల భార్య భర్తల మధ్య కలహాలు తలెత్తాయి. దీంతో మనస్తాపం చెందిన శంకర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య, వారి బంధువులు గుట్టు చప్పుడు కాకుండా అంత్యక్రియలకు యత్నించారు. శంకర్ బంధువులు పోలీసు కేసు పెడతామని చెప్పడంతో శ్మశానంలోనే మృతదేహాన్ని ఉంచినట్లు తెలిసింది.




| | |
|---|---|
| **బంగారం :** | |
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.60,000 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,400 |
| **వెండి:** | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.71,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.73.00 |

# నేడు చిత్తూరులో వాహనాల మళ్లింపు

**చిత్తూరు అర్బన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరులో పర్యటించనున్నారు. ఈ మేరకు ట్రాఫిక్ మళ్లింపునకు అధికారులు చర్యలు చేపట్టారు.

- చెన్నై, వేలూరు నుంచి చిత్తూరు, పుత్తూరు, తిరుపతి వైపునకు వెళ్లే వాహనాలు గుడిపాల పోలీస్ స్టేషన్ మీదుగా రామాపురం, కుర్చివేడు, ఎన్ఆర్.పేట నుంచి వెళ్లాలి.
- చెన్నై, వేలూరు నుంచి పలమనేరు, బెంగుళూరు వెళ్లే వాహనాలు తాణా నుంచి సాంబయ్య కండ్రిగ మీదుగా కట్టమంచి, మురకంబట్టు వైపు హైవే బైపాస్‌లోకి వెళ్లాలి.
- తిరుపతి నుంచి వేలూరు వెళ్లే వాహనాలు ఇరువరం బైపాస్, యాదమరి, తుమ్మిందపాళెం, కొట్టాలంపై గుడిపాల హైవే చేరుకొని చెన్నై, వేలూరు వెళ్లాలి.
- సీఎం బహిరంగ సభకు వచ్చేవాళ్లు వాహనాలు టౌన్ మీదుగా వెళ్లి వారికి కేటాయించిన పార్కింగ్ ఏరియాకు చేరుకోవాలి.
- పలమనేరు నుంచి వచ్చే వారు నేరుగా మీటింగ్ ప్లేస్ సమీపంలో కేటాయించిన పార్కింగ్ ఏరియాకు చేరుకోవాలి.

# బోయకొండలో చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

**చౌడేపల్లె:** బోయకొండ గంగమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేష అభిషేకం, అర్చన జరిపించారు. వేదపండితుడు గోవర్ధనశర్మ నేతృత్వంలో హోమం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈఓ చంద్రమౌళి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యం


పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

**తిరుపతి తుడా:** తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కె. బాబు, కార్పొరేటర్ ఆంజనేయులుతో కలిసి తిరుపతి నగరం 12వ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి ప్రజలకు ట్రాఫిక్ సమస్య తగ్గిందన్నారు. ఫ్రీ లెఫ్టలతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్.కె.బాబు మాట్లాడుతూ తమ డివిజన్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, అంకాలమ్మ గుడి నుంచి ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్ వరకు తారు రోడ్డు నిర్మించినందుకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంకాలమ్మ గుడి ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈ సంజీవ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటమునిరెడ్డి, హరినాథ్, మురళీ, రమేష్ రెడ్డి, కుమార స్వామి, జ్ఞానకుమార్, శేఖర్, రఫీ హిందుస్థాని పాల్గొన్నారు.

### భవనంపై నుంచి జారిపడి కార్మికుడి మృతి


జానీ మృతదేహం

**పుత్తూరు రూరల్:** పట్టణంలోని రామనాథం కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల భవనంపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. కాలనాలో వరదయ్య అనే వ్యక్తి భవనం నిర్మిస్తున్నాడు. మేస్త్రీ పి.జానీ (52) పని చేస్తూ అదుపు తప్పి జారి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య మునీంద్రమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇంట్లో చోరీ

**సదుం:** అమ్మగారిపల్లెలో ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన యశోద అనే మహిళ తిరువణ్ణామలైకు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి తలుపు తాళాలు పగులగొట్టి ఉంది. బీరువాలోని 35 గ్రాముల బంగారం, రూ.70వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది.





## క్లుప్తంగా

### విశ్వంకు నేషనల్ ఐకాన్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు



మంత్రి, ఎమ్మెల్సీ నుంచి అవార్డు అందుకుంటున్న విశ్వం విద్యాసంస్థల అధినేత, అకడమిక్ డైరెక్టర్

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థలకు ఐకాన్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్–2023 అవార్డును జాతీయ స్థాయిలో పీఐపీఆర్ సంస్థ ప్రకటించింది. ఈ అవార్డును సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అందుకున్నారు. పీఐపీఆర్ గ్రూప్ ప్రతినిధులు మాట్లాడుతూ తిరుపతి విశ్వం విద్యాసంస్థ స్కూల్ 33 ఏళ్లుగా అకడమిక్ సిలబస్‌తో పాటు సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్టు వెల్లడించారు. అందువల్లే అవార్డుకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు.

### క్రమపద్ధతిలో విద్యుత్ బస్సుల ఆపరేటింగ్

**తిరుపతి అర్బన్:** విద్యుత్ బస్సుల ఆపరేటింగ్ క్రమపద్ధతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ.వెంకటరావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కడప నుంచి ఆయన విద్యుత్ బస్సులో తిరుపతికి విచ్చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ప్రజారవాణ అధికారి చెంగల్‌రెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, తిరుపతి డీఎం బాలాజీ, అలిపిరి డీఎం హరిబాబు, ఏటీఎం రామచంద్రనాయుడు, కార్గో ఇన్‌చార్జి సురేంద్రబాబు ఉన్నారు.

### స్విమ్స్ అభివృద్ధే లక్ష్యం

**తిరుపతి తుడా:** సీనియర్ ప్రొఫెసర్లు, వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితో స్విమ్స్ ఆస్పత్రిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని స్విమ్స్ వీసీ, డైరెక్టర్ టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. సిమ్స్‌లోని సీ ఫర్ బిల్డింగ్‌లో నూతనంగా స్విమ్స్ వీసీ చాంబర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి స్విమ్స్ డైరెక్టర్ చాంబర్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం సదాభార్గవి మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన అత్యాధునిక వైద్య సదుపాయాలు సమకూర్చేందుకు టీటీడీ సిద్ధంగా ఉందన్నారు.

### శాస్త్రోక్తంగా మృత్యుంజయ స్వామికి పూజలు



**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని తొలుత స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చ కర్పూరంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పలురకాల పుష్పాలు, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహా మంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

### ఘనంగా అగ్నిగుండ మహోత్సవం



పూజల్లో బియ్యపు పవిత్రారెడ్డి

**శ్రీకాళహస్తి:** మండలంలోని దొడ్డమిట్టలో పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి రూ.10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, పెంచులయ్య, కట్టయ్య, రమేష్, గురవయ్య, చంద్రశేఖర్, జగదీష్, గురునాథ్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# గలీజు రాతలు!



చదును చేస్తున్న పార్కు

**నాడు**

అది తిరుచానూరు లెక్కదాఖల సర్వే నం.234లోని స్థలం. చెరువుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అయితే గత ప్రభుత్వాలు అక్కడ ఫైవ్ స్టార్ హోటల్స్‌కు, శిల్పారామానికి, కళాశాలలు, స్కూల్స్‌కు, ప్రభుత్వ సంస్థలకు భూములు కేటాయించాయి. అందులో ఇప్పటికే భారీ భవనాలు వెలిశాయి. అందులో భాగంగానే నాడు తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(తుడా)కి దాదాపు 20 ఎకరాలు కేటాయించారు. 22 ఏళ్ల క్రితం ఈ కేటాయింపులు జరిగాయి. తనకు కేటాయించిన స్థలాన్ని ప్రజాప్రయోజనాల కోసం నాడు తుడా బహిరంగ వేలంలో ఓ ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇచ్చింది. లీజుకు తీసుకున్న వాళ్లు అందులో అమ్యూజ్‌మెంట్ పార్కును ఏర్పాటు చేశారు. అందుకోసం భారీగా గోతులను తీసి అందులో బోటింగ్.. వంటి ఆహ్లాదకరమైన ఏర్పాట్లు చేశారు. అయితే ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగక పోవడంతో ఐదేళ్లలోనే లీజుదారులు చేతులు ఎత్తేశారు. అప్పటి నుంచి దాని ఆలనాపాలనా పట్టించుకునేవారు కరువయ్యారు.

**నేడు**

స్థానికులు, చుట్టుపక్కల వాళ్లు మురుగు నీరు, దుర్గంధం నుంచి విముక్తి కల్పించాలని తుడా, జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. అప్పటి వరకు విలువైన ఈ స్థలం గురించి పట్టించుకోని తుడా అధికారులు సైతం ఒక్కసారిగా కళ్లు తెరిచారు. రేణిగుంట రోడ్డు నుంచి తిరుచానూరు వరకు వస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు కూడా ఈ భూముల మీదుగానే రావడంతో.. అమ్యూజ్‌మెంట్ పార్కు కోసం తీసిన గోతులను పూడ్చివేసి, మురుగునీటిని మళ్లించాలని నిర్ణయించారు. భూమి మొత్తం చదును చేసిన తర్వాత ఓ ప్రైవేటు సంస్థకు ఐదేళ్ల పాటు లీజుకు ఇవ్వాలని పేపరు ద్వారా బహిరంగ ప్రకటన ఇచ్చారు. ఓ సంస్థతో అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. గుంతలను పూడ్చివేసేందుకు దాదాపు రూ.20 లక్షల వరకు ఖర్చుచేశారు. ఇదే సమయంలో తుడా టవర్స్ కోసం రాయలచెరువు రోడ్డు వద్ద తుడా ఓ భారీ ప్రాజెక్టును చేపట్టింది. అక్కడ వస్తున్న మట్టి, వ్యర్థాలను తీసుకొచ్చి పార్కు కోసం తీసిన గుంతలను పూడ్చుతున్నారు.

- గతంలో అమ్యూజ్‌మెంట్ పార్కు కోసం తీసిన గుంతలు పూడ్చుతున్న తుడా
- పెద్ద చెరువును మింగేస్తున్నారంటూ ఎల్లో మీడియా రోత రాతలు
- రద్దయిన అమ్యూజ్‌మెంట్ పార్కు గుంతలను మాత్రమే పూడ్చుతున్న వైనం

**తిరుపతి రూరల్:** తిరుచానూరు–తిరుపతి రహదారికి అనుకుని ఉన్న తిరుచానూరు లెక్కదాఖల సర్వే నం.234 పరిధిలో ఉన్న తుడాకు చెందిన అమ్యూజ్‌మెంట్ స్థలంలో జరుగుతున్న పనులపై ఎల్లో మీడియా రోత రాతలు రాసి తన ఏడుపును మరోసారి వెళ్లగక్కింది. తిరుచానూరు పెద్ద చెరువును మింగేస్తున్నారని.. ప్రైవేట్ సంస్థకు పెద్ద చెరువు.. భారీ యంత్రాలు, టిప్పర్లతో పూడ్చివేస్తున్నారంటూ అడ్డగోలుగా అసత్యప్రసారాలకు తెగబడింది. వైఎస్సార్‌సీపీ నాయకుల హస్తం ఉందంటూ మరో ఎత్తుగడ పేల్చింది. తమ అసత్యాలకు అధికారుల వివరణను సైతం మార్చివేసి జోడించింది. ప్రస్తుతం సర్వే నం.234లో దాదాపు 20 ఎకరాల వరకు చెరువుగానే ఉంది. తుడాకు సంబంధించిన 13 ఎకరాల్లోనే ఐదు ఎకరాలు మాస్టర్ ప్లాన్ రోడ్డుకు పోయింది. మరో ఐదు ఎకరాల వరకు చెరువు బఫర్ జోన్‌గా వదిలేశారు. మిగిలిన మూడు ఎకరాలను ఆన్‌లైన్ ద్వారా గ్లోబల్ టెండర్లు పిలిచి లీజుకు ఇవ్వాలని తుడా అధికారులు నిర్ణయించారు. ఈ మూడు ఎకరాల్లోనే అమ్యూజ్‌మెంట్ పార్కు కోసం తీసిన గుంతలు పూడ్చివేసేందుకు రాయలచెరువు రోడ్డు నుంచి మట్టిని తీసుకువచ్చి ఇక్కడ వేస్తున్నారు. ఈ పనులపై ఎల్లో మీడియా అసత్య కథనాలను అచ్చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మురుగు గుంతలను మాత్రమే పూడ్చుతున్నాం**

తుడాకు కేటాయించిన స్థలంలో గతంలో లీజుదారులు అమ్యూజ్‌మెంట్ పార్కు కోసం తీసిన గుంతల వల్ల మురుగునీరు చేరి, దుర్గంధం వెదజల్లుతోందని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో మురుగు గుంతలను పూడ్చి, మురుగనీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టాం. మూడు ఎకరాలను అభివృద్ధి చేసి ఐదేళ్ల పాటు లీజుకు ఇవ్వాలని పేపరు ద్వారా టెండర్లు పిలిచి, పారదర్శకంగా కేటాయించాం. ఎక్కడా చెరువును ఆక్రమించలేదు. అధికారులు ఇచ్చిన వివరణను సైతం వక్రీకరించడం బాధాకరం.

– హరికృష్ణ, వైస్ చైర్మన్, తుడా, తిరుపతి

### కల్‌రోడ్డుపల్లిలో విషాదఛాయలు

- తాడిపత్రి సీఐ ఆత్మహత్యతో బోరుమంటున్న గ్రామస్తులు



ఆనందరావు మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు(ఇన్‌సెట్) ఆనందరావు(ఫైల్)

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** అనంతపురం జిల్లా, తాడిపత్రిలో సీఐ ఆనందరావు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన స్వగ్రామం చంద్రగిరి మండలం, కల్‌రోడ్‌పల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. సోమవారం సాయంత్రానికి ఆనందరావు పార్థీవదేహం కల్‌రోడ్‌పల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ బంధువులు, గ్రామస్తులు బోరున విలపించారు. వారం క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామానికి అండగా ఉంటూ, కష్టాలలో ఉన్న వారికి ఆర్థిక సాయం చేసేవాడని వారు గుర్తుచేసుకుంటున్నారు. ఆయన మృతి గ్రామానికి తీరని లోటని గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గతంలో కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో, తిరుమలలో ఏపీఎస్పీగా పనిచేశారని తెలిపారు. ఆనందరావు మృతి పట్ల చంద్రగిరి పీటీసీలో నివాళులర్పించారు.

# నీరుగార్చి..నిందలా?



షార్ కేంద్రం ముఖద్వారం వద్ద భద్రత



నిఘానీడలో భాగంగా తీరప్రాంతం వైపు గస్తీలో ఉన్న భద్రతా సిబ్బంది

**నిఘా నీడలోనే షార్**

- శ్రీహరికోట భద్రతకు ముప్పేమీలేదు
- మెరైన్ స్టేషన్ల నిర్వహణ గాలికొదిలేంది టీడీపీనే
- ఆ తప్పిదాన్ని ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టే కుట్ర
- పచ్చమీడియా కథనంపై మండిపడుతున్న స్థానికులు

**సూళ్లూరుపేట:** రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేకపోయినా ఎల్లో మీడియా ఏదో విధంగా ప్రభుత్వంపై విషం చిమ్ముతూనే ఉంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుతూ అప్పట్లో జరిగిన పొరపాట్లును కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆపాదించి రాక్షసానందం పొందుతోంది. ఇలాంటిదే రెండు రోజుల క్రితం ఈనాడులో ‘తీరప్రాంత భద్రతపై నీలినీడలు’ శీర్షికన వార్త వెలువడింది. అసలు తీర ప్రాంత భద్రతకు, శ్రీహరికోట రాకెట్ కేంద్రం భద్రతకు ఎలాంటి సంబంధం లేకపోయినా కల్పిత కథనాలతో జనాన్ని తప్పుదారి పట్టించింది. అసలు విషయం ఏంటంటే..?

**చీమచిటుక్కుమన్నా కనిపెట్టేస్తాయ్**

శ్రీహరికోట రాకెట్ కేంద్రానికి చుట్టూరా వెయ్యి మందికి పైగా సాయుధులైన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల సిబ్బంది నిత్యం నిఘాలో ఉంటారు. ముఖ్యంగా బంగాళాఖాతం అంచున పెద్ద టవర్లు నిర్మించుకుని అందులో అత్యంత అధునాతనమైన తుపాకీలతో పహారా కాస్తుంటారు. అదేవిధంగా కోస్టర్ గార్డ్స్ కూడా సముద్రంలో మరో వైపు పహారాలోనే ఉంటారు. తీరప్రాంతంలో చీమ చిటుక్కుమన్నా కనిపెట్టే రాడార్ వ్యవస్థ ఉంది. పైపెచ్చు శ్రీహరికోటకు పవర్‌ఫుల్ రాడార్లు ఉన్నాయి. ఎవరైనా సముద్రమార్గం గుండా చొరబడితే వెంటనే గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉంది. శ్రీహరికోట అటవీప్రాంతంలో మొబైల్‌పార్టీలు గస్తీ తిరుగుతుంటాయి. బంగాళాఖాతం అంచున ఎంత పెద్ద తుఫాన్ అయినా సరే భద్రత విషయంలో వెనకడుగు వేయరు. సునామీ వస్తుందని తెలిసినా భద్రతా సిబ్బంది టవర్లు మీద పహారాలోనే ఉంటారు.

**తప్పొకరిది..నెపం ఇంకొకరిపైనా?**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని కృష్ణపట్నం పోర్టు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. దీనికి దగ్గరగా చెన్నైలో ఎన్నూరు వద్ద మరో పోర్టు నిర్మించారు. 15 ఏళ్ల క్రితం పాకిస్తాన్ నుంచి కొంతమంది ఉగ్రవాదులు సముద్రమార్గం గుండా ముంబైలోకి చొరబడి విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకుని తీర ప్రాంతాల్లో గస్తీ పెంచే క్రమంలో మెరైన్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. వీరికి సముద్రంలో గస్తీ తిరిగేందుకు రూ.115 కోట్లు వెచ్చించి బోట్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ పోలీస్‌స్టేషన్‌లు రాష్ట్ర ప్రభుత్వాల సాయంతోనే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో నడిచాయి. తర్వాత 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాకు మెరైన్ పోలీస్‌స్టేషన్ విషయాన్ని పక్కన పెట్టి వాటి నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది. అంటే రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ వీటి అజమాయిషీ చేస్తూ వచ్చి మధ్యలో గాలికి వదిలేసింది. 2017 నాటికే వీటిమీద అజమాయిషీ లేకుండా పోయింది. ఫలితంగా వీటి పనితీరు మందిగిస్తూ సిబ్బంది కేటాయింపులు, బదిలీలు లేకుండా పోయాయి. వీరికి కేటాయించిన బోట్ల నిర్వహణ లేక కృష్ణపట్నం పోర్టులో పార్కింగ్ చేశారు. ఇలా గత ప్రభుత్వంలో మెరైన్ పోలీస్‌స్టేషన్లను నీరుగార్చి పనితీరు లేకుండా చేసేశారు.

**వారిది ప్రత్యేకమైన వ్యవస్థ**

మెరైన్ డిపార్ట్‌మెంట్‌కు, షార్ కేంద్రం భద్రతకు ఎలాంటి సంబంధం లేదు. షార్ భద్రత అనేది ప్రత్యేకమైన వ్యవస్థ. వారి నిబంధనల మేరకు గట్టి బందోబస్తు ఉంటుంది. మెరైన్ అంటే సముద్రం మీద నిఘా, తీర ప్రాంత గ్రామాలకు ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వస్తున్నారా! ఒకవేళ వస్తే వారికి ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా! అనే విషయం మీద మెరైన్ పనిచేస్తుంది. అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే సమాచారం అందించాలని తీర ప్రాంత గ్రామాలకు చెందిన వారికి అవగాహన సదస్సులు నిర్వహించడం లాంటివి చేస్తున్నాం. ఇక పడవల విషయానికొస్తే అవి కృష్ణపట్నంలో పార్కింగ్‌లోనే ఉన్నాయి. శ్రీహరికోట, వాకాడు మెరైన్ స్టేషన్‌ల పరిధిలో బోట్లు ఎక్కడానికి సరైన జెట్టీలు లేవు. అందుకు వాటిని అక్కడే పార్కింగ్ చేశారు.

– సుబ్బారావు, మెరైన్ సీఐ

# పరిపూర్ణం..మహాచండీ హోమం



పూర్ణాహుతిలో మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కమిషనర్ హరిత, ఆలయ చైర్మన్, ఈవో, అర్చకులు

**తిరుపతి కల్చరల్:** శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం మహా చండీహోమాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని సింహ వాహనంపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా మహా చండీ హోమం చేపట్టారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల ఆధ్వర్యంలో చేపట్టిన పూర్ణాహుతితో మహా చండీ హోమం పరిసమాప్తమైంది. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునికృష్ణయ్య, పాలక మండలి సభ్యుడు టీ.వెంకటేశ్వరరావు, ఎం.హరినాథ్‌రెడ్డి, పీ.ధనశేఖర్, వీ.క్రిష్ణమ్మ, ఎన్.భారతి, పాల్గొన్నారు.

**ఆలయ సిబ్బందికి జాతర బహుమానం**

గంగజాతర బహుమానంగా ఆలయ సిబ్బందికి నగదు బహుమతులను అందజేశారు. మేయర్, డెప్యూటీ మేయర్, కమిషనర్ చేతుల మీదుగా 30 మంది ఆలయ సిబ్బందికి జాతర బహుమానంగా మొత్తం రూ.1.5 లక్షలను అందజేశారు.

# రికార్డులు లేకుంటే జరిమానా తప్పదు

- జిల్లా వ్యాప్తంగా ఆర్టీఏ స్పెషల్‌డ్రైవ్
- 144 కేసులు నమోదు
- రూ.14.8 లక్షల జరిమానా



రికార్డులు లేని వాహనాలను పరిశీలిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కుసుమ

**తిరుపతి మంగళం:** వాహనానికి సంబంధించి సరైన రికార్డులు లేకుంటే జరిమానా తప్పదని జిల్లా రవాణాశాఖాధికారి(డీటీఓ) సీతారామిరెడ్డి హెచ్చరించారు. తిరుపతి జిల్లాలోని తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, గూడూరు, సూళూరుపేట ప్రాంతాల్లో వాహనదారుల రికార్డుల పరిశీలనతో పాటు రోడ్డు ప్రమాదా ల నివారణపై ఆయన ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందుకోసం ఎంవీఐ స్థాయి అధికారులతో సోమవారం ఒక్క రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రికార్డులు లేని 144 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అలాగే వాహనదారుల నుంచి రూ.14.8 లక్షలు జరిమానా రూపంలో వసూలు చేశారు.

**రికార్డులు తప్పనిసరి**



రోడ్లపైకి వచ్చి వాహనాలు నడిపేటప్పుడు ఆ వాహనానికి సంబంధించిన రికార్డులు కచ్చితంగా ఉండాలి. ప్రతి వాహనదారుడు రవాణాశాఖకు ట్యాక్స్‌లు చెల్లించాలి. అలా లేకుండా వాహనాలు నడుపుతుంటే వాటిని సీజ్ చేస్తాం. ఓవర్‌స్పీడ్, హెల్మెట్ ధరించకపోయినా, సీటు బెల్ట్ పెట్టుకోకపోయినా జరిమానా తప్పదు.

– సీతారామిరెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి

# ఆలయాల్లో వేడుకగా గురుపౌర్ణమి



ప్రత్యేక అలంకరణలో శ్రీ షిరిడిసాయిబాబా

**చిత్తూరు రూరల్:** చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీ షిరిడి విశ్వసాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి కాగడ హారతి, పంచామృత అభిషేకం, సత్యనారాయణ వ్రతం, సంధ్యా హారతి, సాయిభజనలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం కుంకుమార్చన చేశారు. నిర్వాహకులు సీకే లావణ్య పాల్గొన్నారు.

**అయ్యప్ప స్వామి ఆలయంలో..**

**యాదమరి:** మండల కేంద్రంలో వెలసిన శ్రీ షిరిడి సాయి బాబా, అయ్యప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సాయిబాబా చిత్రపటాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



కేశవానందస్వామిని సత్కరిస్తున్న భక్తులు

**ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం**

**బంగారుపాళెం:** మండలంలోని మాధవనగర్‌లో ఉన్న బ్రహ్మానందాశ్రమంలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆశ్రమ నిర్వాహకుడు కేశవానందస్వామి ఆధ్వర్యంలో శ్రీసత్య నారాయణస్వామి మూల విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో స్వామివారి చిత్రపటాన్ని మండపంలో ఏర్పాటు చేసి సత్య నారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కేశవానంద స్వామి శ్రీసత్యనారాయణ స్వామి వ్రత ఫలితం, గురు పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. ఆశ్రమ నిర్వాహకుడు కేశవానందస్వామిని భక్తులు సన్మానించి, ఆశీర్వచనాలు తీసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



చిత్తూరు : కుంకుమార్చనలో భక్తులు



సారె తీసుకెళుతున్న పాలకమండలి సభ్యులు

### ముక్కంటి సారె సమర్పణ

**శ్రీకాళహస్తి:** విజయవాడ దుర్గమల్లీశ్వరస్వామి ఆలయానికి సోమవారం ముక్కంటి సారె అందజేశారు. ఇంద్రకీలాద్రిలో జరుగుతున్న శాకంబరి ఉత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు ఆధ్వర్యంలో సారె సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ జేఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు రమాప్రభ, కొండూరు సునీత, సుబ్బారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

### నిత్యోత్సవం

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లకు వైభవంగా నిత్యోత్సవం నిర్వహించారు. తొలుత జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## క్లుప్తంగా

### వరసిద్ధునికి రూ.4లక్షల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి సోమవారం పలువురు దాతలు రూ.4లక్షలను విరాళంగా అందించారు. ఒంగోలుకు చెందిన రాజేష్‌బాబు, కుటుంబసభ్యులు గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.2లక్షలు, శాశ్వత నిత్యాన్నదానానికి రూ.లక్ష అందజేశారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వెంకటలక్ష్మి, నరసింహ స్వామి, కుటుంబసభ్యులు గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు నగదు అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ సురేష్, బాబు పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన వరదరాజస్వామి గుడిలో సోమవారం శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఉభయ దేవేరీ సమేత స్వామివారికి విశేష అభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై వ్రతం ఆచరించారు. రాత్రి స్వామివారు గరుడుని అధిరోహించి పురవీధుల్లో విహరించారు.

### నాటా కథల పోటీలకు 'తెగి అతికిన బతుకులు'



మేఘనాథ్ రెడ్డి

పలమనేరు : నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) వారు ఏటా నిర్వహించే కథల పోటీలకు పలమనేరు మండలం కాలువపల్లెకు చెందిన కేవీ మేఘనాథ్‌రెడ్డి రచించిన తెగి అతికిన బతుకులు కథ ఎంపికైంది. ఈ మేరకు నాటా భాషా సాహిత్య విభాగం సమన్వయకర్త ఊరిమిండి నరసింహారెడ్డి అమెరికాలోని డల్లాస్ నుంచి నాటా వెబ్‌సైట్‌లో పెట్టారు. ఈ పోటీలకు ఎంపికైన నాలుగు కథల్లో ఇది ఒకటి కావడం విశేషం. ఇందుకు గాను రచయితకు రూ.15వేల నగదు బహుమతి అందనుంది. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన మేఘనాథ్‌రెడ్డికి పలువురు సాహితీ ప్రియులు, భాషాభిమానులకు అభినందనలు తెలిపారు.

### పేట అగ్రహారంలో ఫ్యామిలీ ఫిజిషియన్

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతుందని పూతలపట్టు పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక అన్నారు. మండలంలోని సోమవారం పేట అగ్రహారం పంచాయతీలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని వైద్యశాఖ సిబ్బంది నిర్వహించారు. ఈ క్యాంపులో భాగంగా గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. బీపీ, చక్కెర వ్యాధి గ్రస్తులకు 85 మందికి చికిత్సలు అందజేశారు. గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామాన్ని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీళ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోకూడదన్నారు. తద్వారా దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, చికన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతి రైతుకూ బీమా పరిహారం

ఐరాల: వాతవరణ ఆధారిత పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం బీమా పరిహారం అందిస్తుందని ఏఓ వరలక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ 23 మంది రైతులకు రూ.12.30 లక్షలు బీమా కింద మంజూరైందన్నారు. ఈ నెల 8వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంటల బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారన్నారు. ఈ జాబితాలను ఆయా ఆర్‌బీకేల్లో ప్రదర్శించామని, అభ్యంతరాలు ఉంటే మంగళవారం సాయంత్రంలోపు తెలియజేయాలని సూచించారు.

### నేటి నుంచి రూ.50కే కిలో టమాటా

చిత్తూరు అగ్రికల్చర్: నగరంలోని రైతు బజారులో కిలో టమాటా రూ.50కే పంపిణీ చేయనున్నట్లు రైతు బజార్ ఎస్టేట్ అధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. ఇందుకోసం 3 టన్నుల టమాటాలు తెప్పించినట్లు చెప్పారు. ఒక్కో వ్యక్తికి కిలో చొప్పున అందజేస్తామన్నారు.

# నాడు ఆక్రోశం.. నేడు ఆనందం

చిత్తూరులోని విజయా డెయిరీ.. వేలాది మంది కార్మికుల ఇళ్లలో పొయ్యి వెలిగించింది. లక్షలాది మంది రైతులకు జీవనోపాధి కల్పించింది. రెండు దశాబ్దాల క్రితమే దేశంలోనే అతిపెద్ద డెయిరీగా ప్రసిద్ధి చెందింది. తిరుమల శ్రీవారి సేవలకు టన్నుల్లో నెయ్యి సరఫరా చేసింది. రోజూ రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి వ్యాగన్లలో ఉత్తరాది రాష్ట్రాలకు పాలు ఎగుమతి చేసింది. వాణిజ్యకేంద్రగా విరాజిల్లిన డెయిరీ.. కుటిల నేతల కుట్రలకు బలైంది. స్వప్రయోజనాల కోసం తెగబడే స్వార్థపరుల కుతంత్రాలకు మూతపడింది. 21 ఏళ్ల తర్వాత మళ్లీ పూర్వవైభవం సంతరించుకునే దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అమూల్ సంస్థ ఆధ్వర్యంలో పునరుత్తేజం పొందేందుకు ఉవ్విళ్లూరుతోంది. పచ్చ మీడియా ప్రస్తావించడానికి కూడా ఇష్టపడని నాటి కార్మికులు.. కర్షకుల ఆక్రోశానికి.. నేటి ఆనందానికి నిదర్శనమే ఈ కథనం.

మూతపడిన విజయా డెయిరీ (ఫైల్)



నూతనంగా నిర్మించనున్న అమూల్ యూనిట్ (నమూనా చిత్రం)




- నేటి తరం తెలుసుకోవాల్సిన నిజం
- దేశంలోనే అతిపెద్దదైన విజయా డెయిరీ మూతపడింది ఎలా..?
- 20 ఏళ్ల క్రితమే రోజుకు 4 లక్షల లీటర్ల పాల సేకరణ
- తిరుమల శ్రీవారి సేవలకే టన్నుల్లో నెయ్యి సరఫరా
- హెరిటేజ్ కోసం కార్మికులు.. రైతుల గొంతుకోసిన చంద్రబాబు
- గత చరిత్రను తలచుకుని ఇప్పటికీ కన్నీళ్లు పెడుతున్న కార్మికులు
- సీఎం వైఎస్ జగన్‌తోనే మళ్లీ మంచిరోజులంటున్న రైతులు
- అమూల్ సంస్థకు అప్పగించడంతో పరిశ్రమకు పునర్జన్మ

చిత్తూరు అర్బన్ : పాలు సేకరించి, శీతలీకరించే కేంద్రంగా విజయా డెయిరీ 1945లో ప్రారంభమైంది. 1969లో పూర్తిస్థాయి కార్యకలాపాలను ఆరంభించింది. 1988లో చిత్తూరు జిల్లా కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్‌గా ఏర్పడింది. అప్పటి నుంచి జిల్లాలోని అన్ని డెయిరీలను విజయా సహకార డెయిరీ కిందకు తీసుకువచ్చారు. 1988–93 మధ్య రోజుకు సగటున 3లక్షల లీటర్లు, తర్వాత 4 లక్షల లీటర్ల పాలను సేకరించి అతిపెద్ద పాల డెయిరీగా ఆసియాలో రెండో స్థానం, దేశంలో తొలి స్థానంలో నిలిచింది. అప్పట్లోనే తిరుమల శ్రీ సేవలు, నిత్య కైంకర్యాలు, ప్రసాదాల తయారీకి టన్నుల కొద్దీ నెయ్యి, వేల లీటర్ల పాలను విక్రయించేది. ఈ మేరకు తిరుపతిలో అనుబంధంగా ఏర్పాటైన బాలాజీ డెయిరీ ద్వారా సరఫరా చేసేది. అప్పట్లోనే విజయా డెయిరీలో సుమారు 800 మంది ఉద్యోగులు పనిచేసేవారు. దాదాపు 2లక్షలకు పైగా రైతు కుటుంబాలు పరోక్షంగా ఆధారపడేవి.

**స్వార్థం కన్నేసింది!**

చంద్రబాబు నాయుడు సహకార శాఖ మంత్రిగా పనిచేసే రోజుల్లో ఓసారి చిత్తూరు విజయా డెయిరీని సందర్శించారు. ఇక్కడి కార్యకలాపాలు, ఆదాయ విషయాలను సమగ్రంగా పరిశీలించారు. అప్పుడు ఆయన మదిలో పురుడు పోసుకున్న కుట్ర మేరకే విజయా డెయిరీ మూతపడేందుకు తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ముందుగా హెరిటేజ్ డెయిరీ స్థాపించారు. తన చెప్పుచేతల్లో ఉండే నాటి రూట్ సూపర్‌వైజర్ జీవరత్నం నాయుడు ద్వారా విజయా డెయిరీకు వచ్చే పాలను తన హెరిటేజ్ డెయిరీకు మళ్లించడం ప్రారంభించారు. అలాగే తనకు నమ్మిన బంటుగా ఉన్న చిత్తూరు టీడీపీ నేత దొరబాబునాయుడును విజయా డెయిరీకి చైర్మన్‌గా నియమించారు. వీరందరి సహకారంతో డెయిరీలోని పాల పొడి, నెయ్యి తదితర ఉత్పత్తుల విక్రయాలను అడ్డుకున్నారు. అమ్ముడు పోవడంలేదంటూ భారీ నిల్వలను ఉంచేశారు. చివరకు డెయిరీకి నష్టాలు చూపించారు. 2002 ఆగస్టు 31వ తేదీన లాకౌట్ ప్రకటించి పూర్తిగా మూసివేయించారు. విజయా డెయిరీపై ఆధారపడిన లక్షలాది మంది రైతులు, వందలాది కార్మికుల కుటుంబాలను నడిరోడ్డున పడేశారు.

**పునర్వైభవం వైపుగా..**

చంద్రబాబు స్వార్థప్రయోజనాలకు బలైన విజయా డెయిరీకి పునర్వైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. నాడు పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం డెయిరీని పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా విజయా డెయిరీని అమూల్ సంస్థకు లీజుకు ఇచ్చారు. తొలి దశలోనే రూ.150 కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఐస్‌క్రీమ్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు అమూల్ సంస్థ దశలవారీగా డెయిరీని అభివృద్ధి చేసేందుకు మొత్తం రూ.385 కోట్లు పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం చిత్తూరులో అమూల్ డెయిరీకి శంకుస్థాపన చేయనున్నారు. మళ్లీ పాడి రైతులు, కార్మికులకు పునరుజ్జీవం కల్పించనున్నారు.

**దొరబాబే దోషి...**



రోజుకు రూ.30 వేతనంతో 1985లో విజయా డెయిరీలో చేరాను. 1998లో ఉద్యోగం పర్మినెంట్ చేశారు. అయితే హెరిటేజ్ కోసం మమ్మల్ని బెదిరించి వీఆర్ఎస్ ఇవ్వాలన్నారు. నేను ఇవ్వలేదు. డెయిరీను మూసేసి అందర్నీ ఇంటికి పంపించేశారు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. డెయిరీ మూసివేత పాపంలో దొరబాబు నాయుడే అసలు దోషి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన వాహనమిత్ర, చేయూత పథకాలు మాకు ఊతమిస్తున్నారు.

– దక్షిణామూర్తి, విజయా డెయిరీ కార్మికుడు

**సిమెంటు పనికి వెళుతున్నా**



అప్పట్లో విజయా డెయిరీలో మిషన్ల కాడ మెయింటెనెన్స్ చూస్తా ఉండేవాడిని. కడుపులో చల్ల కదలకుండా కుటుంబమంతా బతికేవాళ్లం. కొందరు రాజకీయ నాయకుల కుట్రల వల్ల మా జీవితాలు రోడ్డున పడ్డాయి. ప్రస్తుతం సిమెంట్ పనికి వెళుతూ పొట్టపోసుకుంటున్నాం. ఇప్పుడు డెయిరీని తెరిపిస్తా ఉంటే విగ్రహం తోసేసినారని, సామాన్లు తక్కువకు అమ్మేసినారని మాట్లాడాతా ఉండారు.

– దశరథన్, విజయా డెయిరీ కార్మికుడు

**అప్పట్లో ప్రతి నెలా పండగే..**



విజయా డెయిరీలో పనిచేసేటపుడు వచ్చే జీతంతో ఇంట్లో ప్రతి నెలా పండగలా ఉండేది. కోరిన తిండి తినేవాళ్లం, నచ్చిన గుడ్డ కట్టేవాళ్లం. సొసైటీలో డెయిరీ ఉద్యోగి అంటే గౌరవంగా చూసేవాళ్లు. బ్రహ్మాండంగా ఉన్న డెయిరీను కుట్రలు, కుతంత్రాలతో మూయించి, మమ్మల్ని బలవంతంగా బయటకు తరిమేశారు. అప్పటి నుంచి గుడిలో పనిచేసి నెలకు రూ.5 వేల జీతంతో మా కుటుంబాన్ని లాక్కొస్తున్నా.

– భాస్కర్, విజయా డెయిరీ ఉద్యోగి

**ప్లాన్ ప్రకారం మూసేశారు**



అప్పట్లో డెయిరీ చైర్మన్ దొరబాబు, సూపర్‌వైజర్ జీవరత్నం, జీఎం దైవసహాయం ముగ్గురూ చంద్రబాబు ఏం చెబితే అది చేసేవాళ్లు. హెరిటేజ్ మొదలు పెట్టిన తర్వాత ప్లాన్ ప్రకారం విజయా డెయిరీని మూసేశారు. వందలాది పాల సేకరణ కేంద్రాలను హెరిటేజ్‌కు అప్పగించేశారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే బలవంతంగా వీఆర్ఎస్ ఇప్పించేశారు. డెయిరీ మూతపడడంతో జీవనోపాధిని కోల్పోయి కూలి పనులు చేసుకుంటున్నాం.

– రూబన్, డెయిరీ కార్మికుడు

**ముఖ్యమంత్రికి అభినందనలు**



చిత్తూరులోనే పుట్టాం, ఇక్కడే పెరిగా. రాజకీయాలనేవి పక్కన పెడితే చిత్తూరులో పాల డెయిరీ ప్రారంభం కావడం, రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టడం అనేది గొప్ప విషయం. ఈ పరిశ్రమ స్థాపన వల్ల నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది. ముఖ్యంమంత్రికి అభినందనలు.

– హరికృష్ణ మూర్తి, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్, చిత్తూరు

**పాలవెల్లువతో ఆర్థికాభివృద్ధి**



పాల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. అప్పట్లో గిట్టుబాటు ధర రాక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం జగనన్న పాల వెల్లువ ద్వారా పాలకు మంచి రేటు వచ్చింది. దీంతో ప్రైవేటు డెయిరీలు కూడా దిగి వచ్చాయి. పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. – రోజా, పీఎంకే తండా, రామకుప్పం మండలం

# అర్ధగిరి క్షేత్రంలో గురుపౌర్ణమి



వైభవంగా ప్రాకారోత్సవం

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామికి అర్చకులు అభిషేకం, పూజలు భక్తితో నిర్వహించారు. అనంతరం ఆలయంలో సుదర్శనహోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు చేయించారు. సుందరంగా తయారైన పల్లకిలో వీరాంజనేయ స్వామి కొలువుదీరి ప్రాకారోత్సవం చేస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పౌర్ణమి వేడుకలను ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షణలో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

# మిరపకాయపై అల్లూరి



డ్రాయింగ్ మాస్టర్ దామోదర ఆచ్చారి



యాదమరి: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలోని చిత్రలేఖన ఉపాధ్యాయుడు దామోదర ఆచ్చారి మిరపకాయపై అల్లూరిని చిత్రించారు. అల్లూరి సీతారామరాజు మన్యం గిరిజనులను ఏకం చేసి గెరిల్లా పద్ధతుల్లో దాడులు చేసేవారు. బ్రిటీషు నిరంకుశ పోలీస్ స్టేషన్ అధికారులకు ముందుగా తెలియజేసి, తరువాత మిరపకాయ టపా పేరుతో తన అనుచరులు అగ్గి దొర, గంటదొర, ఎండు పడాలు, గోకిరా ఎర్రేసు తదితరులతో దాడిచేసి ఆయుధాలు దోచుకునేవాడు. బ్రిటీషువారి వెన్నులో వణుకు పుట్టించిన గొప్ప దేశ భక్తుడు అల్లూరి.

# కార్మికులకు 'తీపి'కబురు

- చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు శుభవార్త
- వేతన బకాలు విడుదల చేసిన ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. 450 మంది కార్మికుల ఖాతాల్లో రూ.31.22 కోట్లు జమ చేసింది. ఏళ్ల తరబడి పడిగాపులకు తెరదించింది. సహకార చట్టం 1955 ప్రకారం చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీని 1963 జనవరి 18వ తేదీన 84 ఎకరాల్లో చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. వెయ్యి టన్నుల సామర్థ్యంతో మొదలైన ఫ్యాక్టరీ తర్వాత 1,600 టన్నుల సామర్థ్యానికి చేరుకుని 2003 వరకు దిగ్విజయంగా నడిచింది.

**అమ్మకానికి పెట్టిన చంద్రబాబు**

సజావుగా నడుస్తున్న షుగర్ ఫ్యాక్టరీని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూసివేయించి, అమ్మకానికి పెట్టారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికి ఫ్యాక్టరీని కట్టబెట్టేందుకు యత్నించారు. అయితే కొందరు రైతులు కోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో చంద్రబాబు కుట్రలు సాగలేదు. తర్వాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీని 2004లో తెరిపించారు. 2014 వరకు షుగర్ ఫ్యాక్టరీ కార్యకలాపాలు కొనసాగాయి. మళ్లీ 2014లో గెలుపొందిన చంద్రబాబు 2015లో పూర్తిస్థాయిలో ఫ్యాక్టరీని మూసివేయించారు.

**నెరవేరిన హామీ**

పాదయాత్ర సమయంలో షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఇన్నేళ్లుగా కార్మికులకు చెల్లించకుండా నిలిపేసిన వేతన బకాయిలను విడుదల చేశారు.

**ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం**



కార్మికుల బకాయి వేతనాలను చెల్లించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. చంద్రబాబు షుగర్‌ఫ్యాక్టరీని మూసివేయడమే కాకుండా వేతనాలు కూడా అందించలేదు. జగనన్న ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు న్యాయం చేశారు.

– ప్రసాద్‌రెడ్డి, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడు

# అభివృద్ధిని ఓర్వలేకే అక్కసు..!

పాడి పరిశ్రమకు పట్టుగొమ్మగా విలసిల్లుతున్న విజయా డెయిరీని చంద్రబాబు అండ్ కో..కుట్రపూరితంగా మూసేశారు. అందులోని విలువైన యంత్ర పరికరాలను భద్రపరచకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. రెండు దశాబ్దాలు తర్వాత డెయిరీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టడంతో ఓర్వలేక అక్కసు వెళ్లగక్కుతున్నారు. శిథిలావస్థకు చేరి తప్పుపట్టిన యంత్ర సామగ్రిని పారదర్శకంగా వేలం వేస్తే అవకతవకలను ఆపాదిస్తున్నారు. నిర్ణీత ధరకు మించి విక్రయిస్తే పచ్చ మీడియాలో అసత్య కథనాలను వండి వారుస్తున్నారు.

- విజయా డెయిరీ మూసేశారు.. యంత్ర పరికరాలను గాలికి వదిలేశారు
- పునఃప్రారంభిస్తుంటే అసత్య కథనాలతో విషం కక్కుతున్నారు
- తుప్పు సామగ్రి విక్రయం ద్వారా రూ. 1.40 కోట్ల ఆదాయం



చిత్తూరు విజయా డెయిరీ

చిత్తూరు అగ్రికల్చర్: దశాబ్దాల ఘన చరిత్ర గల విజయా డెయిరీని స్వలాభం కోసం 2002లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుట్రపూరితంగా మూసివేయించారు. తన హెరిటేజ్ డెయిరీని అభివృద్ధి చేసుకునేందుకు లక్షలాది కుటుంబాల పొట్టకొట్టాడు. బాబు అక్రమాలకు నాటి డెయిరీ చైర్మన్ దొరబాబునాయుడు పూర్తిగా సహకరించారు. డెయిరీ లాకౌట్ ప్రకటించి మూతపడే సమయానికి అందులో ఉన్న యంత్ర సామగ్రిని కనీసం భద్రపరచాలనే జ్ఞానం కూడా లేకుండా గాలికి వదిలేశారు. ఏళ్ల తరబడి ఎండకు ఎండి.. వానకు తడిచిన యంత్రాలు, ట్యాంకర్లు, ఇతర వస్తువులు తుప్పు పట్టి ఎందుకూ పనికిరాని స్థితికి చేరుకున్నాయి.

**పారదర్శకంగా విక్రయం**

విజయా డెయిరీని పునఃప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీ కార్యాచరణ చేపట్టారు. ముందుగా డెయిరీ నిర్వహణ బాధ్యతలను ప్రతిష్టాత్మకమైన అమూల్ సంస్థకు అప్పగించారు. ఈ క్రమంలో డెయిరీలో శిథిలావస్థకు చేరిన యంత్ర పరికరాలను పారదర్శకంగా విక్రయించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమించారు. చార్టెట్ అకౌంటెంట్‌తో కూడిన ఈ బృందం డెయిరీలోని సామగ్రిని పరిశీలించి రూ.1.14కోట్లకు విలువ కట్టింది. అనంతరం జిల్లా సహకారశాఖకు టెండర్ల ప్రక్రియను అప్పగించింది. ఈ క్రమంలో పత్రికల్లో ప్రకటనల ద్వారా టెండర్లు ఆహ్వానించారు. జూన్ 16 నుంచి 22వ తేదీ వరకు సీల్డ్ టెండర్ విధానంలో స్వీకరించారు. మొత్తం 140 దరఖాస్తులను కాంట్రాక్టర్లు తీసుకెళ్లినా అందులో 24 టెండర్లు మాత్రమే వచ్చాయి. 22వ తేదీన టెండర్ వేసిన వారి సమక్షంలోనే కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో టెండర్లు ఓపెన్ చేశారు. అత్యధికంగా రూ.1.40 కోట్లకు టెండర్ కోట్ చేసిన ఎంఆర్ మెటల్‌ఫామ్ యజమాని అజ్గర్‌కు టెండర్‌ను ఖరారు చేశారు. మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరించారు.

**ఉద్దేశపూర్వకంగానే తప్పుడు రాతలు...**

డెయిరీని అర్ధాంతరంగా మూసివేసి పాడి రైతులు, కార్మికులను రోడ్డున పడేసినపుడు స్పందించని పచ్చమీడియా , నేడు ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక తప్పుడు రాతలు రాస్తోంది. ఆనాడు విలువైన సామగ్రిని ఏమాత్రం పట్టించుకోకుండా వదిలిపెడితే వారికి తప్పు కనబడలేదు. ఇప్పుడు టెండరు ప్రక్రియ పూర్తి చేసిన 10 రోజుల తర్వాత సామగ్రి వేలంలో అవకతవకలు జరిగాయంటూ అసత్యాలు ఆరోపణలు గుప్పిస్తుండడంపై పలువురు మండిపడుతున్నారు.

**అందరి సమక్షంలోనే..**



డెయిరీలో తుప్పుపట్టిన సామగ్రికి సీల్డ్ టెండర్లనే స్వీకరించాం. ప్రతి అంశంలోనూ పారదర్శకంగా జాగ్రత్తలు తీసుకుని టెండర్ల ప్రక్రియ నిర్వహించాం. కాంట్రాక్టర్లు అందరి సమక్షంలోనే టెండర్‌ను కలెక్టర్ ఖరారు చేశారు. పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేశాం. వీడియో కూడా చిత్రీకరించాం.

– వనజ, జిల్లా సహకారశాఖాధికారి

**తప్పుడు ఆరోపణలు**



డెయిరీని ఉద్దేశపూర్వకంగా మూసివేసిన వారే ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. డెయిరీ ఆవరణలోని తుప్పు సామగ్రి విక్రయంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసున్నాం. ప్రస్తుతం పాడి రైతులను ఆదుకునేందుకు చర్యల్లో భాగంగా డెయిరీని పునఃప్రారంభిస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

# సీఎం పర్యటనలో విద్యుత్ సిబ్బందికి విధులు

చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మంగళవారం చిత్తూరులో పలువురు విద్యుత్ అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా వీరు సమన్వయంతో పనిచేస్తారని వెల్లడించారు. ఈ మేరకు చిత్తూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ఈఈ నరేంద్రనాథ్, ఏఈ అజయ్‌బాబు, గిరింపేట సబ్ స్టేషన్ వద్ద ఏఈ సోమరాజు, మిట్టూరు సబ్ స్టేషన్ వద్ద ఏఈ లోకేశ్వర్‌రెడ్డి, రెడ్డిగుంట సబ్ స్టేషన్ వద్ద డీఈ సతీష్, ఏఈ చలపతి, మెసానికల్ మైదానం వద్ద డీఈ వెంకటలక్ష్మి, ఏఈ సుధాకర్ , అమూల్ డెయిరీ వద్ద డీఈ సుబ్రమణ్యం, ఏఈ కృష్ణకిషోర్, పోలీస్ శిక్షణ కేంద్రం వద్ద ఈఈ దామోదర్, డీఈ రమేష్ , డీఈ జయప్రకాష్ , డీఈ నరేంద్ర , డీఈ చిన్నబ్బ, ఏఈ శ్రీనివాసరావు, డీఈ కొండయ్య, ఏఈ రామిరెడ్డి , ఏఈ ప్రశాంత్, ఏఈ హరిప్రసాద్‌ను నియమించినట్లు వివరించారు. సమన్వయకర్తగా ఎస్ఈ, సహాయకులుగా ఈఈ హరి, పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి, ఏఈలు బాలచంద్ర, రాజేంద్ర బాబు, ఎం.బాషా విధులు నిర్వరించనున్నట్లు వెల్లడించారు.